భాగ్యనగర్ గ్యాస్ పైప్‌లైన్‌కు లీకేజీ

● అప్రమత్తమైన సిబ్బంది

పేట్‌బషీరాబాద్, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గిరినగర్‌లో ఎక్స్‌కవేటర్‌తో భూగర్భ డ్రైనేజీ పనులు చేస్తుండగా భాగ్యనగర్ గ్యాస్ పైప్‌లైన్ డ్యామేజైంది. గ్యాస్ లీక్ అవుతుండడంతో అక్కడే పనిచేస్తున్న వారు వెంటనే ఏజన్సీ నిర్వాహకులకు సమాచారం అందించారు. వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని గ్యాస్ పైప్‌నకు మరమ్మతులు చేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

శిల్పారామంలో సందడే సందడి..

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

మియాపూర్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పారామం ఆదివారం సందర్శకులతో సందడిగా మారింది. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సత్యం డ్యాన్స్ అకాడమీ పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చిన సత్యం పెద్దకుమార్తె మేళ్లచెరువు కామేశ్వరి శిష్యబృందం శివపార్వతులు, పువ్వులు, మరకతమణిమయ, పూజ, కోలాటం, మండూక శబ్దం, జయజయ రవీంద్ర, కృష్ణ శబ్దం, తిల్లానా వంటి అంశాలపై చక్కటి అభినయంతో అందరినీ ఆకట్టుకున్నారు.

సెల్లార్ తవ్వకాలు.. కుంగిన అపార్టుమెంట్ ప్రహరీ

చందానగర్, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ గిరిజ అపార్టుమెంట్ ప్రహరీ కుంగిపోయింది. అపార్టుమెంట్‌కు ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో ఓ సంస్థ అపార్టుమెంట్ కోసం సెల్లార్ గుంతలను తవ్వింది. దీంతో సమీపంలో ఉన్న గిరిజ అపార్టుమెంట్ ప్రహరీ కుంగిపోవడంతో అపార్టుమెంట్ వాసులు భయాందోళనకు గురయ్యారు. ఎక్కడ తమ అపార్టుమెంట్ కూలిపోతుందోనని ఆందోళనతో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

జేఎన్‌టీయూలో ఘనంగా ఎట్ హోమ్



జేఎన్‌టీయూ డైరీని ఆవిష్కరిస్తున్న వీసీ, రెక్టార్, ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లు

హైదరాబాద్ సిటీ, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని శనివారం జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఎట్ హోమ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి హాజరై కేక్ కట్ చేసి న్యూఇయర్ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ-2024 డైరీని, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ గోవర్ధన్, జేఎన్‌టీయూ హైదరాబాద్ కాలేజీ ప్రిన్సిపాల్ విజయకుమార్ రెడ్డి, జగిత్యాల జేఎన్‌టీయూ కాలేజీ ప్రిన్సిపాల్ కామాక్షిప్రసాద్, యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ కాలేజీ ప్రిన్సిపాల్ సింధు, డైరెక్టర్లు లక్ష్మణరావు, విశ్వనాథ్, వెంకటరామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, తారాకళ్యాణి, శ్రీదేవి, సింధు, జయలక్ష్మీతోపాటు వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో కమ్యూనిటీహాల్ ప్రారంభం

వివేకానందనగర్‌కాలనీ, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని రామారావునగర్‌లో రూ. 10లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆదివారం ప్రారంభించారు. కాలనీవాసుల సౌకర్యార్థం నియోజకవర్గ అభివృద్ధి నిధులతో కమ్యూనిటీహాల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, కాలనీవాసులు రాజు, సత్యశంకర్, లోకేష్, జయప్రసాద్, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రావు, నాగరాజు, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్ ఓవరాల్ చాంప్ మేడ్చల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. రెండ్రోజులుగా గచ్చిబౌలి స్టేడియంలో జరుగుతున్న ఈ పోటీలు ఆదివారం ముగిశాయి. ఓవరాల్‌గా అన్ని విభాగాల్లో కలిపి రంగారెడ్డి జిల్లా రన్నరప్‌గా నిలవగా, సంగారెడ్డి జిల్లా తృతీయ స్థానంలో నిలిచింది. జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, విజేతలకు పతకాలు ప్రదానం చేశారు.

లారీని ఢీకొన్న ఆటో

ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

జీడిమెట్ల, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): లారీని ఆటో ఢీకొట్టడంతో ఆటో డ్రైవరు మృతి చెందిన సంఘటన జీడిమెట్ల హెచ్ఎంటీ కంపెనీ ఎదురుగా శనివారం అర్ధరాత్రి జరిగింది. మరో ఇద్దరికి తీవ్రమైన గాయాలయ్యాయి. రొడామిస్త్రీ నగర్‌కు చెందిన షేక్ అస్లాం(22) శనివారం అర్ధరాత్రి సూరారం నుంచి చింతల్ వైపు తన ఆటోలో ప్రయాణికులను తీసుకుని వెళ్తున్నాడు. హెచ్ఎంటీ కంపెనీ వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని ఆటోతో ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఆటో బోల్తాపడింది. అస్లాం తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. శేఖర్, సురేష్‌నాయక్ అనే వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి..

రాయదుర్గం, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి మల్కం చెరువు వద్ద రోడ్డుదాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని క్రెయిన్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గచ్చిబౌలి పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 29న రాత్రి 11గంటల సమయంలో మల్కంచెరువు రోడ్డు దాటుతున్న వ్యక్తి(55)ని క్రెయిన్ ఢీ కొట్టింది. దీంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాత నేరస్థుడి అరెస్ట్

పేట్‌బషీరాబాద్, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న పాతనేరస్థుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పటాన్‌చెరుకు చెందిన ఎం.డి.అబ్బాస్ మహారాష్ట్ర, ఒరిస్సా ప్రాంతాలకు చెందిన కార్మికులను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ నెల 17న ఫిర్యాదు అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు సుచిత్రా చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న అబ్బాస్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. బాలానగర్, పటాన్‌చెరు, కూకట్‌పల్లి, పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 9 దొంగతనాలు చేసినట్లు అంగీకరించాడు. అతని వద్ద నుంచి రూ.300, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.